భర్తకు అనారోగ్య సమస్యలుంటే
భార్య భరణం చెల్లించాల్సిందే

ముంబై, ఏప్రిల్ 11: సాధారణంగా భరణం కేసుల్లో భార్యకు భర్త పరిహారం చెల్లించాలంటూ న్యాయస్థానాలు తీర్పులు చెబుతుంటాయి. కానీ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భర్తకు ఉద్యోగస్తురాలైన భార్య నెలకు 10 వేల రూపాయలు భరణం చెల్లించాలంటూ బాంబే హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ షర్మిల దేశ్‌ముఖ్ ఈ నెల 2న తీర్పు చెబుతూ హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం‘ జీవిత భాగస్వామి’ అన్న పదం అటు భర్తకు, ఇటు భార్యకు కూడా వర్తిస్తుందని తెలిపారు. అనారోగ్యం కారణంగా తన భర్త సంపాదించడం లేదని భార్యే స్వయంగా పేర్కొన్నందున అందులో ఎలాంటి వివాదం లేదని అన్నారు. పోషించుకోలేని స్థితిలో భర్త ఉండి, భార్య సంపాదిస్తున్నప్పుడు విడాకులు పొందినా.. అతని నిర్వహణను చూసే బాధ్యత భార్యదేనని, కాబట్టి నెలనెలా ఆమెయే అతనికి సంరక్షణ ఖర్చులు చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఆల్‌టైమ్ ఫేవరెట్ చికెన్ బిర్యానీ!

10 లక్షల బిర్యానీ ఆర్డర్లతో దేశంలోనే హైదరాబాద్ టాప్

రంజాన్ మాసంలో దేశంలో 60 లక్షల బిర్యానీ ఆర్డర్లు

నగరంలో 5.3 లక్షల హలీం ఆర్డర్లు • రంజాన్‌లో 15% పెరిగిన అమ్మకాలు

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ రంజాన్ నెల నివేదికలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): చికెన్ బిర్యానీ ఎప్పటిలాగానే ఫుడ్‌ప్రియుల హాట్ ఫేవరెట్‌గా నిలిచింది. హైదరాబాదీల మనసు దోచింది. రంజాన్ మాసంలో బిర్యానీ ఆరగించేందుకు నగరవాసులు పోటీపడ్డారు. దేశంలోనే 10 లక్షల బిర్యానీ ఆర్డర్లతో హైదరాబాద్ టాప్ ప్లేస్ దక్కించుకున్నది. రంజాన్ మాసంలో మార్చి 12 నుంచి ఏప్రిల్ 8 తేదీల మధ్యలో ఆర్డర్స్‌ను ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ సమీక్షించింది. ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ మాసంలో బిర్యానీతోపాటు హలీంలోనూ హైదరాబాద్ రికార్డును సొంతం చేసుకున్నది. 5.3 లక్షలు హలీం ఆర్డర్లు డెలివరీ చేశామని వివరించింది. ఇఫ్తార్ సమయాల్లో (సాయంత్రం 5:30-7 గంటల మధ్యలో) 34 శాతం ఇఫ్తార్ ఆర్డర్స్ పెరిగాయని పేర్కొన్నది. ముఖ్యంగా చికెన్ బిర్యానీ, మటన్ హలీం, సమోస, ఫలుదా, ఖీర్ టాప్ ప్లేస్‌లో ఉన్నాయని తెలిపింది. దేశవ్యాప్తంగా 60 లక్షల ప్లేట్ల బిర్యానీ ఆర్డర్లు డెలివరీ చేసినట్టు స్విగ్గీ తెలిపింది. మిగతా నెలలతో పోలిస్తే రంజాన్ మాసంలో 15 శాతం అమ్మకాలు పెరిగాయని వివరించింది. హలీం ఆర్డర్లలో 1454.88 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించింది. దీని తర్వాత స్థానంలో ఫిర్నీ ఆర్డర్లలో 80.97 శాతం, మాల్పువా ఆర్డర్లు 79.09 శాతం, ఫలుదా 57.93 శాతం, డేట్స్ 48.40 శాతం ఆర్డర్లు పెరిగాయని స్విగ్గీ వివరించింది. ఉపవాస దీక్ష విరమణకు నగరవాసులు అధికంగా ఆన్‌లైన్‌లో ఆర్డర్ల మీదనే ఆధారపడినట్టు తెలిపింది. దేశంలో ఆన్‌లైన్ ఆర్డర్లలో ముంబై, కోల్‌కతా, లక్నో, భోపాల్ తదితర నగరాల్లోనూ ఆర్డర్స్ అత్యధికంగా వచ్చాయని వివరించింది.

మూడు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులెవరు?

- **నేడు ఖరారు చేయనున్న సీఈసీ**
- **ఢిల్లీకి 13వ సారి వెళ్లిన సీఎం రేవంత్**

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం ఢిల్లీ వెళ్లారు. శుక్రవారం ఢిల్లీలో జరుగనున్న కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి 14 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినప్పటికీ ఇంకా ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ సీట్లు మిగిలి ఉన్నాయి. వీటికి సీఈసీ అభ్యర్థులను ఖరారు చేయనున్నది. ఈ మూడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా తయారైంది. ముఖ్యంగా ఖమ్మం టికెట్‌ను తమ కుటుంబ సభ్యుల కోసం ఆశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులలో ఎవరికీ టికెట్ ఇచ్చేది లేదని అధిష్ఠానం తేల్చి చెప్పింది. దీంతో తాజాగా నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు పేరు తెరపైకి రాగా.. అంతకు ముందు రామసహాయం రఘురాంరెడ్డి పేరు దాదాపు ఖరారు అయినట్టేనన్న ప్రచారం జరిగింది. అయితే రఘురాంరెడ్డి.. పొంగులేటికి వియ్యంకుడు. ఇప్పటికీ రఘురాంరెడ్డి, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మండవ వెంకటేశ్వర్‌రావు పేర్లు పరిశీలనలో ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఇక కరీంనగర్ అభ్యర్థి విషయంలోనూ ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇక్కడి నుంచి మొదట మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి పేరు బలంగా వినిపించింది. ఆ తర్వాత వెలమ సామాజికవర్గానికి చెందిన రాజేశ్వర్‌రావు పేరు తెరపైకి వచ్చింది. అసెంబ్లీ టికెట్లలో బీసీలకు బీసీలకు అన్యాయం జరిగిందన్న విమర్శ నేపథ్యంలో లోక్‌సభ సీట్లలో ప్రాధాన్యం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఇప్పటికి ప్రకటించిన 14 మందిలో ముగ్గురు మాత్రమే బీసీలు ఉండటంతో, కరీంనగర్ నుంచి కూడా ఆ సామాజికవర్గానికి చెందిన వారికే టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్ స్థానంలో మజ్లిస్‌తో కుదిరిన అవగాహన మేరకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నట్టు సమాచారం. ఇలా ఉండగా ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రముఖ జర్నలిస్ట్ రజత్‌శర్మ నిర్వహించే ఆప్ కీ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్నున్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఢిల్లీ వెళ్లడం ఇది 13వ సారి కావడం గమనార్హం.

కవిత అరెస్టు అక్రమం

> మొదటిపేజీ తరువాయి...

తమ వాదనలు విన్న తరువాతనే ఉత్తర్వులు జారీ చేయాలని కవిత విజ్ఞప్తిచేశారని గుర్తుచేశారు. దీనిపై కోర్టు తన నిర్ణయం వెల్లడించకముందే సీబీఐ ఆమెను అదుపులోకి తీసుకున్నదని చెప్పారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకపోవడం చట్ట వ్యతిరేకమని అన్నారు. సీబీఐ ఎవరికీ తెలియకుండా కోర్టులో అప్లికేషన్లు దాఖలుచేసి అనుమతులు పొందిందని ఆక్షేపించారు. ప్రస్తుతం తీహార్ జైలులో కస్టడీలో ఉన్న కవితను సీబీఐ గురువారం అరెస్టు చేసింది. ఐపీసీ 477, 120(అ), పీసీ చట్టం 7 సెక్షన్ల ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించింది. ఆమెను శుక్రవారం ట్రయల్ కోర్టులో హాజరుపర్చనుంది. కాగా కవితను సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆమె తరఫు న్యాయవాది మోహిత్‌రావు గురువారం రౌస్ ఎవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రంజాన్ సెలవు దినం కావడం, ఈ కేసుకు సంబంధించిన సమాచారం లేదని ప్రతివాదులు చెప్పడంతో ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ సాధ్యం కాదని కోర్టు తెలిపింది. రెగ్యులర్ కోర్టులోనే ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది.

న్యాయవాది మోహిత్‌రావు

కనీస సమాచారం లేకుండా అరెస్టు

కవిత అరెస్టును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న విజ్ఞప్తి మేరకు గురువారం సాయంత్రం 4.55 నిమిషాలకు ప్రత్యేక న్యాయమూర్తి మనోజ్‌కుమార్ విచారణ చేపట్టారు. కవిత తరపున న్యాయవాది నితేశ్ రాణా వర్చువల్‌గా, మోహిత్‌రావు ప్రత్యక్షంగా వాదనలు వినిపిస్తూ.. సీబీఐ చర్యలు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. సీబీఐ చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని, నిబంధనలను తుంగలోకి తొక్కిందని అన్నారు. సీబీఐ కనీస ప్రమాణాలు పాటించలేదని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వాలన్న ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలను సీబీఐ పాటించలేదని తెలిపారు. పిటిషన్‌పై వాదనలు వినాలా? వద్దా? అన్న దానిపై ఇంకా నిర్ణయమే జరగలేదని జడ్జి మనోజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కేసుపై తన దగ్గర ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. మీకేమైనా సమాచారం ఉందా? అని సీబీఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించగా.. తనకూ ఎలాంటి సమాచారం లేదని జవాబు ఇచ్చారు. అసలు సీబీఐ అరెస్టు చేసిందని మీరెలా చెబుతున్నారని కవిత తరఫు న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. కవితను అరెస్టు చేసినట్టు ఆమె భర్త అనిల్‌కు సీబీఐ సమాచారం ఇచ్చిందని మోహిత్‌రావు తెలిపారు. అయితే.. అత్యవసర కేసులను మాత్రమే తాము విచారిస్తామని, కాబట్టి ఈ విషయంలో కవితకు ఎటువంటి ఊరట ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రెగ్యులర్ కోర్టులోనే తేల్చుకోవాలని చెప్పారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని రెగ్యులర్ బెంచ్‌కు సూచించారు. ఈ దశలో న్యాయవాది మోహిత్‌రావు కల్పించుకుంటూ తమ అప్లికేషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరగా.. అందుకు జడ్జి అంగీకరించారు.

అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముంది?

కవిత అరెస్ట్ అన్యాయం, రాజ్యాంగ విరుద్ధమని ఆమె న్యాయవాది మోహిత్‌రావు మీడియాతో చెప్పారు. జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న కవితను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సీబీఐ స్పెషల్ కోర్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. జైలులో ఉన్న కవితను అరెస్ట్ చేయాలంటే వారంట్, కోర్టు పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కోర్టు అనుమతులు ఇవ్వడం అన్యాయమని అన్నారు. ఇలా జరగడం ఇది రెండో సారని చెప్పారు. ఈ నెల 5న కవితను జైళ్లో విచారించేందుకు, ఇప్పుడు అరెస్ట్ చేసేందుకు కోర్టు అనుమతి చ్చిందని తెలిపారు. తమకు ఏం జరుగుతున్నదో తెలియకుండా పూర్తిగా చీకట్లో పెట్టి ఆమెను అరెస్ట్ చేశారని తప్పుపట్టారు. చట్టం ప్రకారం.. ప్రతివాదులుగా తమకు నోటీసు ఇవ్వాలని అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

బూట్లు తెచ్చిన తంటా.. సునాక్ క్షమాపణలు

లండన్, ఏప్రిల్ 11: ఫ్యాషన్ ప్రియులకు, అడిడాస్ సంస్థ వైట్ సాంబా స్నీకర్స్‌ను ప్రేమించే వారికి బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ క్షమాపణ చెప్పారు. ఇటీవల తెలుపు-నీలం రంగు చొక్కా, ప్యాంట్ కాంబినేషన్‌లో అడిడాస్ సంస్థ వారి తెలుపు రంగు సాంబా బూట్లు ధరించి రిషి సునాక్ ఒక ఇంటర్వ్యూకు హాజరయ్యారు. స్నీకర్స్‌కు ప్రత్యేక ట్రెండ్ ఉందని.. వాటిని సునాక్ దెబ్బ తీశారని నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో విమర్శించారు. దీంతో వాటికి సునాక్ స్పందిస్తూ సాంబా లవర్స్‌కు క్షమాపణలు చెప్పారు. తాను కొన్నేండ్ల క్రితమే అడిడాస్ కంపెనీ ఉత్పత్తులకు అభిమానిగా మారిపోయానన్నారు. తన ఆహార్యంపై ఇతరుల దృష్టి ఆశ్చర్యం కలిగించిందని నవ్వేశారు.

కోడ్ ముగియగానే రైతుబంధు.. రుణమాఫీ

- **మరో ఐదేండ్లు రేవంత్‌రెడ్డే సీఎం**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి**

రామగిరి, ఏప్రిల్ 11 : ప్రజలకు హామీ ఇచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపించిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే రైతుబంధు, రుణమాఫీ అందజేస్తామని ప్రకటించారు. గురువారం రంజాన్ సందర్భంగా నల్లగొండలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గాకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చూస్తే కుల, మతాల ఘర్షణలు పెట్టి బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నదని ఆరోపించారు. రాబోయే పదేండ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని పేర్కొన్నారు.

నా భూమిని కాంగ్రెసోళ్లు కబ్జా చేశారు

మంత్రి కొండా సురేఖకు బాధితుడి ఫిర్యాదు

కరీమాబాద్, ఏప్రిల్ 11: కొందరు కాంగ్రెస్ నాయకులు తన భూమిని కబ్జా చేసి అందులో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు ఇక్బాల్ అటవీ, దేవాదాయ, పర్యాటక శాఖల మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశాడు. గురువారం వరంగల్ ఫోర్ట్ రోడ్‌లోని ఈద్గాలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన బాధితుడు ఇక్బాల్.. చింతల్‌లోని సర్వే నంబర్ 444లో గల 275 గజాల తన స్థలాన్ని కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని, వారి కబ్జా నుంచి తన స్థలాన్ని కాపాడి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ.. విచారణ చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

రేవంత్ వసూళ్లకు ఆధారాలున్నాయ్!

బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వం నుంచి భూములు లీజుకు పొందిన పారిశ్రామికవేత్తలను సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించి సెటిల్మెంట్ చేసుకుంటున్నారని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ‘రేవంతూ.. అంటే నా వంతు’ అని అడుగుతున్నారని ఆరోపించారు. ఈ విధంగా సేకరించిన డబ్బును ఢిల్లీకి పంపిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అనేక ఘటనలకు సంబంధించి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. వరుసగా ఒక్కోదానిని బయటపెడుతామని పేర్కొన్నారు.

లష్కర్‌లో కాంగ్రెస్‌కు మూడో స్థానమేనా?

- **‘దానం’ నిరాసక్తత పట్ల అధిష్ఠానం సీరియస్**
- **ప్రచారంలో వెనకబడినట్టు సర్వేలో వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి సికింద్రాబాద్ సీటు కొరకురాని కొయ్యగా మారింది. ఇక్కడి నుంచి పార్టీ అభ్యర్థిగా రంగంలో దింపిన ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రచారంలో పూర్తిగా వెనుకబడినట్టు అంతర్గత సర్వేలో బయటపడటం అధిష్ఠాన పెద్దలను కలవరపరుస్తున్నది. దానం అభ్యర్థిత్వం పట్ల నియోజకవర్గ ప్రజలలో కూడా పెద్దగా స్పందన వ్యక్తం కావడం లేదన్న ఈ సర్వే పార్టీ పెద్దలను ఆందోళనకు గురి చేస్తున్నది. పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు టీమ్ ఈ విషయం ముందే హెచ్చరించినప్పటికీ పార్టీ పెద్దలు సీరియస్‌గా తీసుకోలేదని సమాచారం. అసెంబ్లీ ఎన్నికలలో హైదరాబాద్ నుంచి ఎవరూ గెలుపొందకపోవడంతో నగరంలో కాస్తోకూస్తో గుర్తింపు ఉన్న దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి పార్టీ పెద్దలు ఆసక్తి కనబరిచారు. మరో అడుగుముందుకేసి అధిష్ఠానాన్ని ఒప్పించి ఆయనను సికింద్రాబాద్ నుంచి బరిలోకి దించారు. రెండో జాబితాలోనే దానం పేరును ప్రకటించినప్పటికీ ఆయన ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం ప్రారంభించకపోవడం పట్ల అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ఇందుకు దానం సన్నిహితులు చెప్పే కారణం మరోలా ఉంది. సికింద్రాబాద్‌లో తనను అభ్యర్థిగా ప్రకటించాక కూడా అధిష్ఠానం వేరొక అభ్యర్థి (బొంతు రామ్మోహన్)ను బరిలోకి దింపాలని యోచిస్తున్నట్టు సమాచారం అందడం వల్ల దానం పూర్తిస్థాయిలో ప్రచారం ప్రారంభించలేకపోతున్నారని చెప్తున్నారు. సికింద్రాబాద్‌లో అభ్యర్థి మార్పుపై పునరాలోచన చేసిన మాట వాస్తవమేనని పీసీసీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులను కాంగ్రెస్ మోసం చేసిందన్న సంకేతాలు వెళ్లడం వల్ల చేరికలు ఆగిపోతాయన్న ఉద్దేశంతో ఆ ప్రయత్నం మానుకున్నామని అంటున్నారు.

బొంతు రామ్మోహన్‌కే అంతర్గత మద్దతు

అంతర్గత సర్వేలో దానం పట్ల ఓటర్లలో అంతగా సానుకూలత లేనప్పటికీ, గతంలో ఆయనకు పార్టీతో ఉన్న అనుబంధం, మంత్రిగా పనిచేసిన అనుభవం, హైదరాబాద్‌లో పార్టీ అవసరాలు ఆయనకు టికెట్ ఇవ్వడానికి కారణమని గుర్తు చేస్తున్నారు. సికింద్రాబాద్ టికెట్‌ను మొదట మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు ఇవ్వాలని భావించారు. అయితే దానం నాగేందర్ వంటి సీనియర్ నాయకుడు పార్టీలో చేరడంతో ఆయననే అభ్యర్థిగా ప్రకటించారు. వాస్తవానికి పార్టీ అంతర్గత సర్వేలో నాగేందర్ కంటే బొంతు రామ్మోహన్ అభ్యర్థిత్వానికే ఎక్కువ శాతం ఓటర్లు సానుకూలత వ్యక్తం చేశారని ఈ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. దానం అభ్యర్థిత్వం ఖరారైన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ఇంట్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నేతలు, సమన్వయ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో సికింద్రాబాద్‌లో సిట్టింగ్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మళ్లీ పోటీ పడుతున్న నేపథ్యంలో ఆ స్థానం అత్యంత ప్రతిష్ఠాకరమని గుర్తు చేసినప్పటికీ దానం నుంచి కనీస స్పందన కనిపించడం లేదని పార్టీ పెద్దలు ఆందోళన చెందుతున్నట్టు తెలిసింది. తాజాగా నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో కూడా దానం మూడో స్థానంలో ఉన్నట్టు తెలిసింది. ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించిన 14 స్థానాల్లో పీసీసీ నేతలు ఎప్పటికప్పుడు ఫ్లాష్ సర్వే నిర్వహిస్తూ అధిష్ఠానానికి నివేదికలు పంపుతున్నారు. సికింద్రాబాద్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నా, కాంగ్రెస్ అభ్యర్థి మాత్రం వారిని అందుకోలేనంత దూరంలో ఉన్నారని తెలిసింది. దీనిని అధిగమించడానికి నాగేందర్ చొరవ తీసుకోవడం లేదని అధిష్ఠానానికి నివేదిక అందినట్టు సమాచారం. శుక్రవారం ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీలో కూడా సికింద్రాబాద్ అంశం చర్చకు వచ్చే అవకాశం లేకపోలేదని పార్టీ సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు.

పల్లెలకొస్తే కాంగ్రెస్‌ను తరిమికొడ్తం

- **కాంగ్రెస్‌కు మాదిగల ఓట్లు అడిగే హక్కు లేదు**
- **హస్తం నేతలకు మంద కృష్ణమాదిగ హెచ్చరిక**

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 11 : తెలంగాణలో మెజార్టీ శాతం ఉన్న మాదిగలను విస్మరించిన కాంగ్రెస్‌కు మాదిగలను ఓట్లు అడిగే హక్కు లేదని, ఓట్ల కోసం మాదిగ పల్లెలకు వస్తే తరిమి కొడుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. గురువారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. మాదిగల ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కాంగ్రెస్ చర్యలతో మాదిగల్లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు అవకాశం ఇవ్వాలని, ప్రకటించిన స్థానాలను మార్చి రెండు పార్లమెంట్ సీట్లతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ సీటును మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు పెద్దపీట వేస్తున్నదని విమర్శించారు. మాదిగ కోటా కింద దామోదర రాజనర్సింహకు మంత్రి పదవి ఇచ్చి విలువ లేకుండా చేశారని మండిపడ్డారు. ఇటీవల బాబుజగ్జీవన్ రామ్ భవన ప్రారంభ ఆహ్వాన పత్రికలో రాజనర్సింహ పేరే లేదని తెలిపారు. సమాన వాటా అడిగితే తమను బీజేపీ మనుషులంటున్నారని, జగ్గారెడ్డి మొదలు ఏ పార్టో గుర్తు చేసుకోవాలని సూచించారు. తమ ఓట్లతో నాయకుడిగా ఎదిగిన రేవంత్‌రెడ్డి మాదిగలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే మాల కావడం వల్లే మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు.

కాంగ్రెస్ చేతిలో మళ్లీ మోసపోవద్దు

- **కేంద్రంలో అధికారమిస్తే ఉగ్రదాడులే**
- **బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ**

నవాబ్‌పేట, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని మాజీ మంత్రి, బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో గురువారం బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు రైతులకు రేవంత్‌రెడ్డి ఇస్తామన్న రూ.500 బోనస్, రూ.15 వేల రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పథకాలు అమలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు కేంద్రంలో అధికారమిస్తే ఉగ్రదాడులు జరుగుతాయని చెప్పారు.

‘కావ్య నజీరుద్దీన్’కు ఎందుకు ఓటేయాలి?

- **దళితులను అణచివేసిన కడియంకు బుద్ధి చెప్పాలి**
- **బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్**

వరంగల్, ఏప్రిల్ 11: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ నజీరుద్దీన్‌ను పెండ్లి చేసుకొని గుంటూరు వాస్తవ్యురాలైన మహమ్మద్ కావ్య నజీరుద్దీన్‌కు వరంగల్ ప్రజలు ఎందుకు ఓటేయాలని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ ప్రశ్నించారు. గురువారం హనుమకొండలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. తాను వరంగల్ జిల్లా బిడ్డగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి వర్ధన్నపేట ప్రజలకు సేవ చేశానని చెప్పారు. కడియం శ్రీహరి దళితులను అణచివేశారని, ఆయన కుట్రలకు తాను కూడా బలయ్యాయని ఆరోపించారు. తాను మూడోసారి గెలిస్తే మంత్రి రేసులో ఆయన మంత్రి పదవికి ఎక్కడ అడ్డొస్తానోనన్న భయంతో తన ఓటమికి కుట్ర పన్నారని మండిపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను మాల, మాదిగలకు దక్కకుండా చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో ఉండి ఎస్సీ నేతలను బయటకు పంపించే వరకు కుతంత్రాలు చేశారని దుయ్యబట్టారు. ఏ పార్టీలో ఉన్నా కడియం శ్రీహరి దళితులను ఎదగకుండా అణచివేశారని ఆరోపించారు. ఇప్పుడు వరంగల్ ప్రజలు.. గుంటూరు కోడలు కావ్య నజీరుద్దీన్ కావాలో.. వరంగల్ బిడ్డ అరూరి రమేశ్ కావాలో ఆలోచించాలని కోరారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు అరూరి రమేశ్ పిలుపునిచ్చారు.

తెలంగాణలో పోటీకి టీడీపీ దూరం

- **రాష్ట్ర అధికార ప్రతినిధి వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): మేలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో పోటీకి దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయించింది. ఏపీలో ఎన్డీయేలో భాగస్వామి అయినా, తెలంగాణలో ఎవరికి మద్దతివ్వాలనే విషయంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి గురువారం వెల్లడించారు. తెలంగాణలో టీడీపీ రాజకీయ ప్రయాణం గత కొన్నేండ్లుగా క్లిష్ట వాతావరణంలో కొనసాగుతున్నదని, తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్ తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని తెలిపారు. మహానాడులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై నిర్ణయం తీసుకుంటామని, జూన్ తర్వాత జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పక పోటీ చేస్తామని ఆమె తేల్చి చెప్పారు.

భారత్‌లో మాల్దీవులు రోడ్‌షోలు

పర్యాటకులను మళ్లీ ఆకర్షించే యత్నం

మాలే, ఏప్రిల్ 11: చైనా అనుకూల విధానాన్ని అవలంబిస్తూ భారత్‌తో కయ్యానికి దిగిన మాల్దీవులు ఇప్పుడు సమస్యలతో సతమతమవుతున్నది. పర్యాటక రంగమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మాల్దీవులకు భారత్ నుంచి వెళ్లే పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందుకు గానూ భారత్‌లోని ముఖ్యమైన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించాలని మాల్దీవ్స్ అసోసియేషన్ ఆఫ్ ట్రావెల్ ఏజెంట్స్ అండ్ టూర్ ఆపరేటర్స్ భావిస్తున్నది. ఇందుకోసం భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నది.

15 రోజుల్లోగా టాటూలను తొలగించాలి

ఒడిశా పోలీసులకు అధికారిక ఆదేశాలు

భువనేశ్వర్, ఏప్రిల్ 11: యూనిఫాంలో ఉన్నప్పుడు సిబ్బంది తమ శరీరంపై టాటూలను కలిగి ఉండరాదని ఒడిశా పోలీసులకు నిబంధన విధించారు. 15 రోజుల్లోగా తమ శరీరాలపై ఉన్న టాటూలను తొలగించుకోవాలని ఆదేశించారు. డ్యూటీలో ఉన్న సిబ్బంది ఒంటిపై టాటూలున్నట్టయితే అది పోలీస్ దళ ప్రతిష్ఠను కించపరిచినట్టేనని భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ), స్పెషల్ సెక్యూరిటీ బెటాలియన్, పోలీస్ కమిషనరేట్, భువనేశ్వర్ అధికారిక ప్రకటనలో ఆదేశించింది. టాటూలు అభ్యంతరకరమనవే కాక అసభ్యకరమైనవి, అవమానకరమైనవని అభివర్ణించింది. ఈ ఆదేశాలను పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది.

ప్రతిభావంతులకు ఐఐటీల అండ

నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ • పూర్తి ఉచితంగా చదువుకునే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీల్లో చదవాలని చాలామంది ఆశపడుతుంటారు. వీటిల్లో సీటు పొందేందుకు లక్షలకు లక్షలు ధారపోసేవారు.. రాత్రింబవళ్లు కష్టపడే వారు ఎంతోమంది ఉంటారు. మరి కొంతమంది రోజుకు 8 నుంచి 10 గంటలు తరగతి గదుల్లో.. స్టడీ అవర్స్‌లలో కుస్తీపడుతుంటారు. కానీ, కొందరే ఆ అవకాశాన్ని దక్కించుకుంటారు. ముఖ్యంగా ఐఐటీలంటే సంపన్న వర్గాల వారికేనన్న భావన సామాన్య ప్రజల్లో బలంగా స్థిరపడిపోయింది. ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం ఐఐటీల వైపు చూస్తున్నారు. తమ ప్రతిభతో మిగతావారిని వెనక్కినెట్టి ఐఐటీల్లో చేరుతున్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన పేదవిద్యార్థులకు పలు రకాల స్కాలర్‌షిప్స్ లభిస్తున్నాయి. జేఈఈ మెయిన్ -2 పరీక్షలు ఇటీవలే ప్రారంభమవగా, అడ్వాన్స్‌డ్ పరీక్షలు ముందున్నాయి. అవి ముగిస్తే ఐఐటీల్లోనో, ఎన్ఐటీల్లోనో అడుగుపెట్టడమే. ఈ నేపథ్యంలో ఐఐటీల్లో లభిస్తున్న స్కాలర్‌షిప్స్ వివరాల సమాహారమే ఈ కథనం.

ఐఐటీ కాన్పూర్ స్కాలర్‌షిప్

స్కాలర్‌షిప్ పేరు – ఐఐటీ కాన్పూర్ స్కాలర్‌షిప్ ఫర్ జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్స్.

అర్హతలు – జేఈఈ అడ్వాన్స్‌డ్ టాప్ 100 ర్యాంకర్లు.

స్కాలర్‌షిప్ మొత్తం – ఐఐటీ కాన్పూర్‌లో చదివేందుకయ్యే మొత్తం వ్యయం. (ట్యూషన్‌ఫీజు, హాస్టల్, జీవనవ్యయం)

ఐఐటీ ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఫ్రీ స్కాలర్‌షిప్ –యూజీ

అర్హతలు – అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు.

స్కాలర్‌షిప్ మొత్తం – మొత్తం విద్యార్థుల్లో 10శాతం మందికి పూర్తిగా ఉచిత విద్యనందిస్తారు. సింఘాల్ స్కాలర్‌షిప్ కింద నెలకు రూ. 6,500, రూపామౌడ్గిల్‌స్కాలర్‌షిప్, దౌలమ్ రామ్ మెండిరట్టా స్కాలర్‌షిప్స్ కింద నెలకు రూ.వెయ్యి అందజేస్తారు.

ఐఐఎం అహ్మదాబాద్ అలుమ్ని

ఎవరిస్తారు!?– పూర్వ విద్యార్థులు సమకూర్చిన నిధి ద్వారా ఈ స్కాలర్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. ఎండోమెంట్ ఫండ్ నుంచి ఈ స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు.

ఎంతమందికి?– 30 మందికి ఇస్తారు.

స్కాలర్‌షిప్ మొత్తం – 10 మందికి ఒక్కొక్కరికి రూ. 10లక్షల చొప్పున.. మరో 20 మందికి రూ. 2 లక్షల చొప్పున అందజేస్తారు.

ఐఐటీ మద్రాస్ ఫుల్ స్కాలర్‌షిప్ – డాటాసైన్స్

ఎవరిస్తారు!? – కార్గిల్ సంస్థ భాగస్వామ్యంతో ఐఐటీ మద్రాస్ ఇస్తుంది. కార్గిల్ సంస్థ అమెరికాకు చెందిన గ్లోబల్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ కార్పొరేషన్.

అర్హులు – ఐఐటీ మద్రాస్‌లో బీఎస్సీ డాటా సైన్స్ కోర్సు అభ్యసిస్తున్నవారు.

స్కాలర్‌షిప్ మొత్తం – కోర్సు ఫీజు పూర్తిగా.